# నిర్ణయం

–గొళుమళ్ళ కవిత



"మనసైన మనిషి కోసం ఎదురు చూడటం ఎంత మధురంగా వుంటుందో నీకు తెలుసా బావా! మరికొద్ది రోజుల్లో నిన్ను చూడబోతున్నాననే భావనే మనసంతా నిండిపోయి నన్ను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. గడిచిన ఏడేళ్ళూ నీ తాలూకు జ్ఞాపకాలు నా ఒంటరితనంతో దోబూచులాడి విరహం అర్థాన్ని నాకు తెలియకుండా చేశాయి. నాకింకా జ్ఞాపకముంది....కిలోలకొద్దీ బరువుండే పుస్తకాలను ఆర్తిగా తిరగేసే నీకు, వలపులన్నీ వంపులుగా అలముకున్న నన్ను తిరగెయ్యడానికి తీరిక లేక కళ్ళతోనే నా తనువంతా తడిమేయడం. పుట్టిన రోజు నాడు తెల్ల పరికిణీలో నన్ను చూడగానే ఒత్తుగా పెరిగిన మీసకట్టు చాటున నీ కింది పెదవి వంపు తిరిగి మత్తుగా నన్ను కవ్వించేయడం...అసలెన్నని చెప్పను?...ఒక్కటొక్కటిగా నా మనసులో పదిలపరుచుకున్న అనుభూతులన్నీ నీ మీద కుమ్మరించేయాలని వుంది. మరి నీదే ఆలస్యం".

–నీ

–అమృతవల్లి.

చిరునవ్వుతో ఉత్తరం చదవడం పూర్తిచేసి డెస్క్‌లో పడేయబోతున్న రాజాని ఒక్క అంగలో చేరుకుని అతని చేతిలోని ఉత్తరాన్ని లాక్కుంది 'క్లారా'. ఐదడుగుల ఏడంగుళాల ఎత్తు, పాలమీగడ లాంటి మేని రంగుకు కాంట్రాస్టింగ్‌గా ఒత్తైన నల్లని జుత్తు లాస్‌ఏంజిల్స్ లోని బ్యూటీలందరిలో క్లారాకు ఓ ప్రత్యేకమైన గుర్తింపును తెచ్చిపెట్టాయి. ఆస్ట్రేలియాలో పుట్టి, అమెరికాలోని ఎల్.ఎ.కు మైగ్రేట్ అయిన ఆ ఇరవై ఎనిమిదేళ్ళ అమ్మాయికి రిసెర్చ్ స్కాలర్‌గా ఇండియా నుంచి వచ్చిన రాజు పరిచయమై ఇప్పటికి నాలుగేళ్ళు. అందం, తెలివితేటలతో పాటు ప్రైవేట్ సెక్టార్‌లో నెలకు పదిహేను వేల డాలర్లు సంపాదించే స్థాయికి ఎదిగిన రాజు అంటే ఆ యునివర్శిటీ అమ్మాయిలందరికీ ఎంతో మోజు. 'లూసియానా స్టేట్ యూనివర్శిటీ' అంతటికీ అందగత్తెగా పేరు తెచ్చుకున్న క్లారాకు రాజు వెంటపడే అమ్మాయిలందరినీ వెనక్కు నెట్టి, అతని మనసు గెల్చుకోవడానికి ఆమె అందం ఎంతో తోడ్పడింది. అలాంటి క్లారా ఉత్తరం తెరవగానే, ఆ దస్తూరి అమృతవల్లిదని గుర్తించి, మనసులో రేగుతున్న కసిని అణచిపెట్టి ఏమీ తెలియనట్టే అడిగింది.

"మే ఐ నో హూ రోట్ దిస్ లెటర్?"

'కమాన్ క్లారా. లెటర్ రాసింది ఎవరో తెలిసీ అడుగుతున్నావ్? ఏం నా మరదలు నాకు ఉత్తరం రాయడం తప్పా?'

క్లారా వెనుక నుంచి నడుము చుట్టూ చేతులు వేసి దగ్గరకు లాక్కుని ఆమె జుత్తులో ముఖం దాచుకుంటూ కవ్వింపుగా అడిగాడు.

"ఆఫ్‌కోర్స్..ఐ నో. అయినా ఆ అమ్మాయి గుడ్డిగా నిన్ను ప్రేమిస్తుంధని తెలిసీ ఆమెను వారించే బాధ్యత నీకు లేదా? వెంటనే మన ప్రేమను గురించి ఆమెకు రిప్లై రాసి పడేయ్" అతణ్ణుంచి బలవంతంగా విడిపించుకుని, గ్లాస్ విండో దగ్గరకు నడిచి క్రిందికి చూస్తూ చెప్పింది. ఆ యాభైయవ అంతస్తులోని బెడ్ రూమ్ నుంచి రోడ్డుమీద వెళ్ళే వాహనాలు బెల్లం వాసన గ్రహించి పోటీపడి పరుగెత్తే చీమల్లా వున్నాయి ఆమె మనసులోని ఆలోచనల్లా.


"కమాన్ హనీ. ఇట్స్ ఎ మ్యాటరాఫ్ టెన్ డేస్. రేపు నేను ఇండియా వెళ్ళగానే ముందు మన ప్రేమ విషయం నా పేరెంట్స్‌తో చెప్పేస్తాను. ఆ తర్వాత వాళ్ళిష్టపడితే నీకు కబురు చేస్తాను. ఒకవేళ వాళ్ళిష్టపడకపోతే వెంటనే బయల్దేరి వచ్చేస్తాను. దట్సాల్. అదీ నన్ను పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులకు నా పెళ్ళి గురించి చెప్పాల్సిన బాధ్యత నాకుంది కాబట్టి చెబుతాను. వాళ్ళు ఔనన్నా, కాదన్నా మన పెళ్ళి జరిగి తీరుతుంది...ఇక నా మరదలి సంగతంటావా! లెట్ హర్ గో టు హెల్" క్లారాను తనవైపు తిప్పుకుని చూపుడు వేలితో చుబుకాన్ని పైకి లేపుతూ చెప్పాడు.

అతని మాటలతో మనసు ప్రశాంతమైన క్లారా పెదవులు అందంగా విచ్చుకున్నాయి. అతని మెడ చుట్టూ చేతులు వేసి, మునివేళ్ళపై లేచి, కొంటెగా నవ్వుతున్న అతని పెదవులు అందుకుంది క్లారా. ఆమె చేతిలోని ఉత్తరం ముక్కలై విసురుగా వీచిన గాలికి బెడ్‌రూమ్ నిండా పరుచుకున్నాయి. ఆరోజు ఉదయమే అమెరికన్ గవర్నమెంట్ శాంక్షన్ చేసిన 'గ్రీన్ కార్డ్' డ్రెస్సింగ్ టేబుల్ పై గాలికి రెపరెపలాడుతోంది.

*** *** ***

"యట్‌లాస్ట్ యు ఒన్ దట్ మ్యాన్" ఒక చేత్తో టేబుల్‌పై వాలి, మరో చేత్తో స్కాచ్ సిప్ చేస్తున్న క్లారాను అడిగింది జెస్సీ.

అమెరికా అంతటిలో ధనవంతులు సరదాగా గాంబ్లింగ్ కోసం విచ్చేసే 'కాసినో' అది. చిక్కగా అలముకున్న సిగరెట్ పొగ, దానితో కలిసిన డిఫరెంట్ వాసనలతో విచిత్రంగా వుంది ఆ వాతావరణమంతా. హై వాల్యూమ్‌లో వస్తున్న వెస్ట్రన్ మ్యూజిక్‌కి తగ్గట్టుగా ఊగిపోతున్న అమ్మాయిలను సెలెక్ట్ చేసుకోవడానికి విచిత్రమైన సంజ్ఞలు చేస్తున్నారు అబ్బాయిలు. ఆ ప్రదేశానికి కొంచెం దూరంలో కూర్చుని స్కాచ్ తాగుతూ వున్నారు వాళ్ళిద్దరూ. వాళ్ళ సంభాషణంతా ఇంగ్లీషులో సాగిపోతోంది.



"మరి ఎంతకాలం నీలా లేట్‌నైట్ డ్యూటీలు వేసుకుని కస్టమర్ల కోసం పడిగావులు పడమంటావ్?" జెస్సీ కంఠంలోని జెలసీని గ్రహించిన క్లారా కోపంగా అరిచింది. కొద్ది క్షణాల తర్వాత స్కాచ్ అందించిన మత్తులో కొద్దిగా తూలుతూ మూసుకుపోతున్న కనురెప్పలను బలవంతంగా తెరిచి, మాడిపోయిన జెస్సీ ముఖాన్ని చూసి కోపాన్ని కంట్రోల్ చేసుకున్న క్లారా చెప్పడం మొదలుపెట్టింది.

తండ్రెవరో తెలియక, తల్లి బ్రతికుందో లేదో అర్థంగాక, అర్ఫన్‌గా పెరిగిన నాకు డబ్బు విలువేంటో బాగా తెలుసు. ఈ సొసైటీలో నెగ్గుకు రావాలంటే తగిన ఫైనాన్షియల్ బ్యాక్‌గ్రౌండ్ వున్న రాజు లాంటి వాళ్ళ అండ వుండాలిగా డియర్. అందుకే బోర్ కొట్టే వరకూ అతని సంపాదనతో మజా చేసి, అంతకంటే రిచ్ ఛాప్, నైస్ పర్సన్ దొరికేవరకూ అతణ్ణి లవ్ చేస్తున్నట్టే నటిస్తాను. బికాజ్ ఐ వాంట్ టు బి రిచ్. అందుకు ఎంత మంది మగాళ్ళని మార్చాల్సి వచ్చినా ఐ డోంట్ కేర్" గ్లాసు పైకెత్తి చివరి చుక్క వరకూ తాగేసి చెప్పింది క్లారా.

అంతవరకూ కూల్‌గా క్లారా వెళ్ళగక్కుతున్న నిజాలను విన్న జెస్సీ మనసులో ఓ ప్లాన్ రూపుదిద్దుకోనారంభించింది.

*** *** ***

పోస్టులో వచ్చిన ఆ బరువైన ప్యాకెట్‌పై 'టు మిస్టర్ రాజు" అనే అక్షరాలు అందంగా టైప్ చేయబడి వున్నాయి. డిన్నర్ పూర్తిచేసి తీరుబాటుగా ప్యాకెట్ విప్పిన రాజుకు అందులోని 'వీడియో క్యాసెట్' ఆశ్చర్యాన్ని కలిగించింది. వి.సి.ఆర్.లో క్యాసెట్ ఫిక్స్ చేసి, ఎదురుగా వున్న సోఫాలో జారగిలబడి రిమోట్ ప్లే చేయడంతో తెరపై బొమ్మలు కదలడం మొదలుపెట్టాయి. ఆ దృశ్యం అర్థం చేసుకోవడానికి అతనికి రెండు నిమిషాలు పట్టింది.

ఎదురుగా కనిపిస్తున్న చేదు నిజం తాలూకు తీవ్రమైన షాక్‌తో ఆలోచనలు స్తంభించి, అలాగే అచేతనంగా చూస్తుండిపోయాడు. తను ప్రాణాధికంగా ప్రేమించిన క్లారా చీకటి జీవితంలోని వింత కోణాల్నీ ఒక్కొక్కటిగా తెరపై కనిపిస్తుండటంతో తట్టుకోలేని ఆవేశంతో రిమోట్‌ను టి.వి.కేసి విసిరి కొట్టాడు. టి.వి. స్క్రీన్ భళ్ళున పగిలి ముక్కలైంది అతని మనసులాగా. పొంగుకొస్తున్న దుఃఖాన్ని ఆపుకోలేక, రెండు అరచేతులతో ముఖాన్ని కప్పుకున్న రాజు మనసులోని క్లారా రూపం క్రమక్రమంగా కరిగిపోవడం మొదలెట్టింది.

*** *** ***

న్యూయార్క్ ఎయిర్‌పోర్ట్ నియాన్ లైట్ల కాంతిలో ధగధగ మెరిసిపోతూ వుంది. ఫ్లైట్ బయలుదేరడానికింకా గంట టైముంది. లాంజ్‌లో కూర్చుని వున్న రాజుకు గడిచిన వారంలో జరిగిన ఆ చేదు సంఘటన కళ్ళ ముందు మెదిలింది. అంతవరకూ మనసంతా చిక్కగా ఆవరించుకొని వున్న క్లారా ప్రేమ మత్తు విడిపోవడం మొదలెట్టాక, తనను ప్రాణాధికంగా ప్రేమించే స్వచ్ఛమైన అమృత చిరునవ్వు ముఖమే ప్రతిక్షణం కళ్ళ ముందు ప్రత్యక్షమౌతోంది. ఊహ తెలిసినప్పటినుంచీ తన కోసమే పుట్టి, తన ప్రేమ కోసమే బ్రతుకుతున్నట్టుండే అమృత ప్రేమను కాదని, స్వదేశ సంస్కృతి, సంప్రదాయాలను లెక్క చేయకుండా క్లారాతో జీవితం పంచుకోవాలనుకున్నాడు తను. ఇప్పుడు ఆమె తన మనసుకు చేసిన గాయం పూర్తిగా మానేలోపే....

మరో అరగంటలో ఫ్లైట్ బయల్దేరుతున్నట్టు అనౌన్స్‌మెంట్ వినిపించడంతో ఆలోచనల నుంచి బయటపడిన రాజు ఆ క్షణమే తన జీవితాన్ని మార్చబోయే ఓ బలమైన నిర్ణయం తీసుకున్నాడు. క్షణాల్లో మనసు తేలికపడడంతో జేబుల్లో చేతులు దూర్చి ఐదడుగుల దూరంలో కనిపిస్తున్న జ్యూయలరీ షాప్ వైపు నడవటం మొదలుపెట్టాడు. ఆ షాపులో అద్దాల మాటున మెరుస్తున్న వస్తువులలో తనకు కావలసిన దాని కోసం వెదకడం మొదలుపెట్టాడు. పావు గంట శ్రమ పడ్డాక, మనసుకు నచ్చిన ఆ వస్తువు దొరకగానే, క్షణాల మీద ప్యాక్ చేయించి పరుగు లాంటి నడకతో విమానం చేరుకున్నాడు.

అతను సేఫ్టీ బెల్ట్ బిగించుకున్న ఐదు నిమిషాలకు విమానం గాలిలోకి లేచింది. దేదీప్యమానంగా వెలిగిపోతూ దూరమైపోతున్న అమెరికా, రాజు చేతిలోని డైమండ్ రింగ్ ముందు వెలవెలబోయింది.